క్లుప్తంగా

నాగేంద్రబాబుకు అవార్డు



నాగేంద్రబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం ఫార్మ్, గుంటూరు పరిధిలోని ఏలూరు ఏరువాక కేంద్రంలో విస్తరణ శాస్త్రవేత్త ఎన్ నాగేంద్ర బాబుకు ఉత్తమ విస్తరణ శాస్త్రవేత్త అవార్డు లభించింది. వ్యవసాయ రంగంలో రైతుల కోసం నాగేంద్రబాబు చేసిన కృషికి అంతర్జాతీయ న్యూట్రింట్–2025 సదస్సులో భాగంగా పంజాబ్‌లోని సాంగ్రూర్‌కు చెందిన భాయ్ గురుదాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్ (బీజీజీఐ) సంస్థ ఈ ఉత్తమ విస్తరణ శాస్త్రవేత్త అవార్డును అందజేశారు.

పెరిగిన ఓటింగ్ శాతం

ఏలూరు(మెట్రో): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు 456 పోలింగ్ కేంద్రాల్లో జరిగింది. మొత్తం 3,14,984 మందికి 2,18,902 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 69.50గా నమోదైంది. 2019 ఎన్నికల కంటే తాజా ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగింది. గత ఎన్నికల్లో 2,93,794 మంది ఓటర్లు ఉంటే వారిలో 1,92,137 మంది (65.40)ఓటుహక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ గతం కంటే 4.09 శాతం పెరిగింది.

నేడు విద్యుత్ సరఫరా ఉండదు

ఏలూరు రూరల్ : గుడివాకలంక సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంచేందుకు చేపట్టిన పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు గుడివాకలంక, మొండికోడు, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, కొక్కిరాయిలంక, కోమటిలంక, పెదయాగనమిల్లి, చినయాగనమిల్లి గ్రామాలకు సరఫరా నిలిపేస్తామని వివరించారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

ఏలూరు(మెట్రో): పింఛన్ల పంపిణీ శనివారం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమవుతుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. 2,60,452 మంది లబ్ధిదారులకు రూ.112.94 కోట్లు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్ పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పింఛన్ తీసుకోని వారికి సోమవారం అందజేస్తామని తెలిపారు.

వ్యాధులపై సర్వే

దెందులూరు: వ్యాధులపై ఇంటింటా సర్వే చేస్తున్నామని గోపన్నపాలెం సీహెచ్‌సీ వైద్యాధికారులు రాకేష్, రోజా అన్నారు. శుక్రవారం సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల సర్వేను వారు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనారోగ్య సమస్యలను సిబ్బందికి తెలియజేయాలని ప్రజలకు సూచించారు.

ప్రజలపై భారం మోపే బడ్జెట్

వామపక్షాలు, కార్మిక, రైతు సంఘాల నేతల విమర్శ

రాష్ట్ర బడ్జెట్ ప్రజలపై భారాలమోపేలా ఉందని వామపక్ష పార్టీల నాయకులు, కార్మిక సంఘాలు, రైతు సంఘాల నాయకులు విమర్శించారు. రాబోయే తరాలను అప్పుల ఊబిలోకి నెట్టే విధంగా కూటమి ప్రభుత్వ పనితీరు ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ నిధులు నిల్.. ఖజానా ఫుల్ అన్న చందంగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

– ఏలూరు (టూటౌన్)

సూపర్ సిక్స్ హామీల అమలెక్కడ?



ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్.. స్వీట్ సిక్స్ హామీలను విస్మరించారు. ప్రస్తావించిన ఒకటి, రెండు పథకాలకూ అరకొర నిధులే కేటాయించారు. డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ కింద వడ్డీ మాఫీ చేస్తామన హామీని ప్రస్తావించలేదు. ప్రతి నెలా మహిళలకు రూ.1500, ఉచిత బస్సు సౌకర్యం, 50 సంవత్సరాలు నిండిన బీసీలకు పెన్షన్ కల్పిస్తామన్న హామీలను అటకెక్కించారు. అన్నదాత సుఖీభవ, దీపం పథకం వంటి వాటికి నిధుల్లో భారీగా కోత విధించారు. సాగునీటి ప్రాజెక్టులకు మరిన్ని నిధులు కేటాయించాలి. బడ్జెట్‌లో 10 శాతం అంటే సుమారు రూ.32 వేల కోట్లు నిధులు కేటాయించాల్సిన ఆవశ్యకత ఉంది.

– బండి వెంకటేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యుడు, సీపీఐ ఏలూరు జిల్లా

సక్రమంగా వినియోగించాలి



బడ్జెట్‌లో వివిధ రంగాలకు కేటాయించిన నిధులు సక్రమంగా వినియోగించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఆయా నిధులు ప్రజా సంక్షేమానికి వినియోగించే క్రమంలో పక్కదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉంది. నిధులు లేవని చెబుతూనే ఇంతటి భారీ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం ఒక విధంగా ధైర్యం చేశారనే చెప్పాలి. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నుంచి కూడా రాష్ట్రానికి మద్దతు ఉంటుంది.

– అంబికా కృష్ణ, పారిశ్రామికవేత్త

కార్మికుల ఆశలు ఆవిరి



బడ్జెట్‌లో కార్మికుల ఊసే లేదు. కొన్ని పథకాల అమలుకు కేటాయింపులు చేశామని చెప్పిన ఆర్థిక మంత్రి కార్మికుల వేతనాలు, సంక్షేమానికి ప్రతిపాదనలు చేయలేదు. అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ జీఓ ఇవ్వకుండానే అమలు చేశామని చెప్పడం హాస్యాస్పదం. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఆశ వర్కర్ల జీతాలు పెంపు ప్రస్తావన చేయలేదు. జీతాలు పెరుగుతాయన్న లక్షల మంది చిరుద్యోగులు, స్కీం వర్కర్లు ఆశలు ఆడియాశలయ్యాయి. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు పునరుద్దరణ, హమాలీ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు ప్రస్తావన చేయలేదు. 50 లక్షల మంది షెడ్యూల్డ్ కార్మికుల వేతనాలు ప్రస్తావన కనిపించలేదు.

– డీఎన్‌వీడీ ప్రసాద్, కార్యదర్శి, సీఐటీయూ ఏలూరు జిల్లా

రైతాంగానికి మొండిచేయి



రూ.48,341 కోట్లతో ప్రతిపాదించిన వ్యవసాయ బడ్జెట్ రైతాంగానికి ఊరట ఇచ్చేదిగా లేదు. రైతుల ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉంది. వ్యవసాయ సంక్షోభం నుంచి రైతాంగాన్ని గట్టెక్కించేలా కేటాయింపులు లేవు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని బడ్జెట్‌లో రూ.222 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. గోదావరి డెల్టా ఆధునీకరణకు రూ.11 కోట్ల కేటాయింపు ఏ మూలకూ రావు. నూజివీడులో మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటును అటకెక్కించారు. ఆక్వా రంగానికి విద్యుత్ సబ్సిడీ మినహా ఏ రాయితీలూ ప్రకటించలేదు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పారే తప్ప నిర్దిష్టమైన కేటాయింపులు లేవు. పంటలకు ధరల స్థిరీకరణ పేరుతో రూ.300 కోట్లు మాత్రమే కేటాయించారు. పంటల బీమా పథకం పేరుతో రైతులపై ప్రీమియం భారం వేశారు.

– కిలాడి శ్రీనివాస్, కార్యదర్శి, ఏపీ రైతు సంఘం, ఏలూరు జిల్లా

6న కార్మికుల చలో విజయవాడ



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఈనెల 6న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు కోరారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) దశల వారి ఆందోళనల్లో భాగంగా శుక్రవారం ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కార్యాలయంలో నగర కార్పొరేషన్ పరిధిలో రాజకీయ పక్షాలు, కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల వేతనాలు మున్సిపల్ శాఖ ద్వారా మాత్రమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ రద్దు చేసి కార్మికులను, దళారి, ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 3న కలెక్టరేట్ ఎదుట ఆందోళన, 6న చలో విజయవాడ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ, ఆటో యూనియన్, ఏఐఎస్ఎఫ్, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : విద్యార్థుల్లో ఉండే సృజనాత్మక శక్తికి మరింత పదును పెట్టి నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించడానికి కృషి చేయాలని సమగ్రశిక్ష జిల్లా అదనపు సమన్వయకర్త పంకజ్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక సుబ్బమ్మదేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ నిర్వహించిన జాతీయ సైన్స్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000 చొప్పున నగదు, సర్టిఫికెట్, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమాన్ని జిల్లా సైన్స్ అధికారి ఎస్‌వీఎస్ సోమయాజులు పర్యవేక్షించగా పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎ.నాగేశ్వరరావు, సుబ్బమ్మదేవి స్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.కుటుంబరావు విజేతలకు బహుమతులు అందించారు. నగరంలోని శ్రీ సూర్య ఇంగ్లీష్ మీడియం, శ్రీ శర్వాణి, సీఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూళ్లలో జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.

సాంకేతికతపై అవగాహన ఉండాలి

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్ బ్రాంచ్ మేనేజర్ టి.సాయిరాం సూచించారు. స్థానిక సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కంప్యూటర్ శాఖ ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ టెక్నాలజీస్ అండ్ దేర్ కెరీర్ ఆపర్ట్యూనిటీస్ అనే అంశంపై నిర్వహించిన అతిథి ఉపన్యాస కార్యక్రమంలో సాయిరాం మాట్లాడారు. నూతన సాంకేతికతను వివరించారు. విద్యార్థినులు వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: బైక్‌పై బస్సును ఓవర్ టేక్ చేయిబోయి యువకుడు మృతి చెందాడు. ఏలూరు సత్రంపాడుకు చెందిన మెండం రత్నకుమార్ (22) ఎలక్ట్రికల్ పనులు చేస్తూ తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి తన స్నేహితుడి బండిపై వట్లూరు వెళ్లాడు. ప్రభుత్వ ఐటీఐ కళాశాల సమీపంలో ముందెళుతున్న బస్సును ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పి బస్సు కిందపడటంతో తల ఛిద్రమైంది. దీంతో అతని స్నేహితుడు పరారయ్యాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

ఆటల్లో సుబ్బమ్మదేవి విద్యార్థుల సత్తా



ఆటల పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

ఏలూరు రూరల్ : పాఠశాల స్థాయి ఆటల పోటీల్లో తమ విద్యార్థులు సత్తా చాటారని ఈదర సుబ్బమ్మదేవి మునిసిపల్ స్కూల్ హెచ్ఎం పి.కుటుంబరావు ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కేపీడీటీ స్కూల్ ఆవరణలో జరిగిన జోన, సెంట్రల్ జోన్ ఆటల పోటీల్లో బాలబాలికల జట్లు ఖోఖో అంశంలో ప్రథమ, త్రోబాల్ పోటీల్లో బాలుర జట్టు విజేతగా నిలిచిందని పేర్కొన్నారు. జోన్ స్థాయిలో ప్రతిభ చాటిన ఎం దొరబాబు సెంట్రల్ జోన్ 200, 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచాడని తెలిపారు. పీఈటీ ఎం లీలాకుమారి, పీడీ జె.సునీతతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

న్యాయవాది సుబ్బారావు మృతి తీరని లోటు

ఏలూరు (టూటౌన్): ప్రముఖ న్యాయవాది ఏలూరు భారసోసియేషన్ కల్చరల్ యాక్టివిటీస్ నెంబర్ తిగిరిపల్లి సుబ్బారావు (టీఎస్ఆర్) అకాల మరణం ఏలూరు బార్ అసోసియేషన్‌కు తీరని లోటని బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోనే సీతారామ్ పేర్కొన్నారు. సుబ్బారావు సంస్మరణ సభను జిల్లా కోర్టు న్యాయవాదులు శుక్రవారం ఇండోర్ స్టేడియం వద్ద ఉన్న లేడీస్ క్లబ్‌లో నిర్వహించారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

సినీ నటుడు షఫీ సందడి



నిమ్మకాయల వ్యాపారులతో సినీ నటుడు షఫీ

ద్వారకాతిరుమల: నిమ్మకాయలు బాబు.. నిమ్మకాయలు, కవరు పది రూపాయలు మాత్రమే రండి, రండి అంటూ ప్రముఖ సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ షఫీ ద్వారకాతిరుమలలో గురువారం సందడి చేశారు. సినీ నటుడు మాణిక్‌రెడ్డితో కలిసి ఆలయానికి విచ్చేసిన షఫీ స్వామి వారి దర్శనానంతరం కారులో తిరుగు ప్రయాణమయ్యారు. అయితే స్థానిక లింగయ్య చెరువు వద్దకు వచ్చే సరికి నిమ్మకాయలు అమ్మే మహిళలు షఫీ కారుకు అడ్డు పడి, నిమ్మకాయలు కొనాలని కోరారు. వెంటనే కారు దిగిన షఫీ నేను కూడా నిమ్మకాయలు అమ్ముతానంటూ కింద కూర్చున్నారు. దీంతో చుట్టూ ఉన్న వ్యాపారులు నవ్వులు చిందించారు. అనంతరం షఫీ ఆ వ్యాపారులతో ఫొటోలు దిగారు. ఛత్రపతి, ఖడ్గం వంటి హిట్ చిత్రాల్లో నటించిన షఫీ తమతో సరదాగా గడపడం ఆనందాన్ని ఇచ్చిందని వ్యాపారులు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే షఫీ వ్యాపారులతో దిగిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో శుక్రవారం వైరల్ అయ్యాయి.

ఎదురుచూపులు



నిలిచిన పేదల ఇళ్ల నిర్మాణ పనులు

- ఆన్‌లైన్ ప్రక్రియతోనే కాలయాపన
- హౌసింగ్ లోన్ కోసం వేడుకోలు
- పట్టించుకోని ప్రభుత్వం

ఏలూరు రూరల్ : ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు చేస్తాం అంటూ ఎన్నికల సమయంలో పేదలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడిచినప్పటికీ ఏ ఒక్క లబ్ధిదారునికీ రూపాయి రుణం మంజూరు చేయలేదు. ఇప్పటి వరకు ఏలూరు నియోజకవర్గంలో 1200 మంది పేదలు ఆన్‌లైన్ చేసుకుని రుణం కోసం ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా పేదలకు 90 రోజుల్లో స్థలం మంజూరు చేస్తే, నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు రుణం మంజూరు చేయలేకపోతున్నారని వాపోతున్నారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సైతం ఇసుక, ఐరన్, సిమెంట్ అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అక్కసుతో జగనన్న కాలనీలను నిర్వీర్యం చేస్తున్నారని వాపోతున్నారు.

నాడు నిధుల వెల్లువ

వైఎస్సార్ సీపీ హయాంలో ఏలూరు నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణానికి నాటి సీఎం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.68.17 కోట్లు విడుదల చేశారు. ఫలితంగా పోణంగి, కొమడవోలు, చొదిమెళ్ల జగనన్న కాలనీల్లో 22,374 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వీరిలో 782 మంది ఇళ్ల నిర్మించుకున్నారు. 5000 ఇళ్లకు ఫిల్లర్స్ వేసి బేస్‌మెంట్ పూర్తిచేశారు. 263 ఇళ్లకు గోడలు పూర్తి కాగా, 347 ఇళ్లకు పునాధులు వేశారు. ఇవి కాకుండా కాంట్రాక్టర్ సహకారంతో 15,982 మంది ఇళ్ల పనులు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక నాలుగు నెలల పాటు నిధులు విడుదల నిలిచిపోంది. లబ్ధిదారులు గగ్గోలు పెట్టారు. దీంతో ప్రభుత్వం అరకొర నిధులు విడుదల చేస్తూ లబ్ధిదారులను మభ్యపెడుతోంది. దీనిపై హౌసింగ్ డీఈ రామకృష్ణ వివరణ కోరగా, ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆన్‌లైన్ పక్రియ కొనసాగుతోందన్నారు. ఇప్పటి వరకు 1200 మంది పేదలు ఇళ్ల నిర్మాణం కోసం ఆన్‌లైన్ చేసుకున్నట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయబోయే నిధులు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రుణం మంజూరు చేస్తుందని వివరించారు.



జగనన్న కాలనీలో నిలిచిన ఇంటి నిర్మాణం

చిత్తశుద్ధి లేదు



ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ పేదలను నమ్మించి మోసం చేస్తారు. వైఎస్సార్ సీపీ హయాంలో జగనన్న కాలనీలు శరవేగంగా అభివృద్ధి చెందాయి. ఇప్పుడు ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. రోడ్లను అభివృద్ధి చేయడం లేదు. వీధిలైట్లు సైతం వెలగడం లేదు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, నీటి సరఫరా చేయడం లేదు.

– ముంగర సంజీవ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నేత

ఆన్‌లైన్‌తో సరా!



కూటమి ప్రభుత్వం వస్తే రూ.4 లక్షలు రుణం వస్తుంది. ఇల్లు కట్టుకోవచ్చు అనుకున్నాను. ఆన్‌లైన్ కూడా చేసుకున్నా. 6 నెలలు గడుస్తున్నాయి. ఆన్‌లైన్‌లో పేరు కనబడుతోంది. కాని రుణం మంజూరు కాలేదు. ఎంతకాలం ఎదురుచూడాలి. ప్రభుత్వం త్వరగా రుణం మంజూరు చేయాలని కోరుతున్నా.

– కె.కృష్ణవేణి, వెంకటాపురం

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

ఏలూరు(మెట్రో): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా, నీటి ద్వారా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పింఛన్లు, సానుకూల ప్రజా అవగాహన, ఎంఎస్ఎంఈ సర్వే, ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కులు, ఫీడర్ స్థాయి సోలారైజేషన్ పథకానికి భూమి కేటాయింపు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వి జిల్లా అధికారులతో సమీక్షించారు. ఏలూరు నగరంలో తాగునీటి సరఫరాపై కమిషనర్‌ను ఆరా తీశారు. జిల్లాలోని మంచినీటి చెరువులను కాల్వలను మూసేలోగా పూర్తిస్థాయిలో నింపాలన్నారు. వేసవిలో నీటి ద్వారా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ వి.విశ్వేశ్వరరావు, జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు, సీపీఓ సీహెచ్ వాసుదేవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏపీఐఐసీ జెడ్ఎం కె.బాబ్జి, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, విద్యుత్ శాఖ ఎస్ఈ సాల్మన్ రాజు, పౌర సరఫరాల శాఖ జీఎం శ్రీలక్ష్మి, ఏపీఎస్ ఆర్టీసీ డీయం బి.వాణి, నగర కమిషనర్ ఎ.భానుప్రతాప్, డీఎల్‌పీఓ సుందరి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ రైతుల సమస్యలు పరిష్కరించాలి

పెదవేగి : ఆయిల్ పామ్ గెలలు గ్రేడింగ్‌పై రైతులు ఆందోళన చేసిన ఫలితంగా ఆయిల్ ఫెడ్ కర్మాగారంలో అధికారులు రైతులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులతో చర్చలు జరిపారు. ఆయిల్ పామ్ గెలల గ్రేడింగ్ సమస్య పరిష్కరిస్తామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం పరిధి ఆయిల్ పామ్ రైతు సంఘం అధ్యక్షుడు ఉండవల్లి వెంకట్రావు, రైతులు మన్నే బాబూరావు, బొల్లు రామకృష్ణ మాట్లాడుతూ రైతుల సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ఆయిల్ ఫెడ్ కర్మాగారం ప్రైవేటీకరణ ఆపాలని, కొత్త కర్మాగారం నిర్మించాలని కోరారు. ఆయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ గ్రేడింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆయిల్ పామ్ రైతులు, ఆయిల్ ఫెడ్ అధికారులు పాల్గొన్నారు

కరపత్రం విడుదల

జంగారెడ్డిగూడెం : కాటికాపర్ల సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ అన్నారు. జంగారెడ్డిగూడెం ప్రజా సంఘాల కార్యాలయంలో కాటికాపర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ శ్మశానంలో వృత్తి చేస్తున్న వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. వయో వృద్ధులైన కార్మికులకు రూ.8 వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. కాగా, కాటికార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మార్చి 3వ తేదీన కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎ.ప్రభాకర్ రావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా చెట్ల నరికివేత

కొయ్యలగూడెం: ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ (శిథిలావస్థ భవనం)లో అక్రమంగా చెట్లను నరికి వేస్తున్నారని స్థానికులు శుక్రవారం ఆరోపించారు. ఈ భవనంలో ఇటీవల సుమారు వందేళ్ల వేప వృక్షం కూలిపోయింది. దీనిని అధికారులు ఆక్షన్ నిర్వహించగా, దీనితో పాటు మరికొన్ని చెట్లను అక్రమార్కులు కొట్టేసి తరలించుకుపోతున్నారని ఆరోపించారు. దీనిపై ఆర్అండ్‌బీ శాఖాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితంగా లేకుండా పోయిందన్నారు.

భక్తిశ్రద్ధలతో పట్టాభిషేక మహోత్సవం



స్వామి వారికి పట్టాభిషేక పూజ చేస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో రామకోటి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదం శెట్టి రమేష్ కుమార్ దంపతులు స్వామివారి పట్టాభిషేక మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు, స్వామి వారికిపూజలు, నిత్య హోమాలు, నిత్య కల్యాణం నిర్వహించారు. సాయంత్రం శ్రీరామ జననం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం, రాత్రి నిర్వహించిన సంగీత గాన లహరి పేరిట సంగీత కచేరి భక్తులకు వీనులవిందు చేశాయి.